

వారాహి అలంకరణలో విద్యారణ్యపుర కాళికా దుర్గాపరమేశ్వరి

కరుణించమ్మా..కాళికాంబ

రాష్ట్రంలోని ఆలయాలు నవరాత్రి శోభను సంతరించుకున్నాయి. శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిస్తూ భక్తులకు అభయమిస్తోంది. శనివారం విద్యారణ్యపుర కాళికా దురా పరమేశ్వరి వారాహి రూపంలో అలరించింది. అమ్మ దర్శనానికి భక్తులు విశేషంగా తరలివస్తున్నారు.



అలంకరణలో గిరినగర్ వాసవీమాత



మైసూరు చాముండేశ్వరి

గజగజలాడిన ఉత్తరం

- భారీ వర్షాలతో ఉత్తర కర్ణాటక విలవిల
- పొంగి పొర్లుతున్న భీమా నది
- జాతీయ రహదారి జలమయం
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



జల దిగ్బంధంలో విజయపుర - షోలాపూర్ జాతీయ రహదారి

బెంగళూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక జిల్లాలో భారీ వర్షాలతోపాటు ఎగువభాగాన ఉండే మహారాష్ట్ర నుంచి వరద పోటెత్తుతోంది. వరదలు జనజీవనంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. విజయపుర జిల్లాలో బీమా, శీనా నదులకు వరదనీరు పోటెత్తుతోంది. మహారాష్ట్రలోని వడకబాళ, హత్తూరు గ్రామాల పరిధిలోని జాతీయ రహదారిపై నీరు పొంగి ప్రవహిస్తుండడంతో రెండు రోజులుగా కర్ణాటక - మహారాష్ట్రల మధ్య రాకపోకలకు అంతరాయం నెలకొంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. డ్రైవర్లు రోడ్డుపైనే వంటలు వండుకుని తింటున్నారు. రహదారిపై ప్రమాదకరం అనిపించేలా నీరు ప్రవహిస్తుండడంతో వాహనాలు, జనసంచారం లేకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు. ఇండి తాలూకా పడనూరు, ఖానాపుర, గుబ్బేవాడ, హిళ్ళి, బుయ్యార, కొడిగనూరు రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. తాళికోటె సమీపంలో బుధవారం ఓ వ్యక్తి డోనీ నదిలో బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. అతడి ఆచూకీ లభించలేదు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ పాటిల్ నడహళ్ళి పలుగ్రామాలను సందర్శించారు. బీమానది వరదల్లో చిక్కుకున్న పదిమందిని అగ్నిమాపకశాఖ అధికారులు రక్షించారు. అలమేలు తాలూకా శంబేవాడి గ్రామంలో నీటిప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురు గర్భిణీలు, ఇద్దరు పిల్లలను రక్షించారు. బీమానది వరదతో 654 మంది పునరావాస కేంద్రాలలో చేర్చారు. 14 కేంద్రాలను ఏర్పాటు చేసి 140 కుటుంబీకులకు జిల్లా యంత్రాంగం సదుపాయాలు కల్పించింది. విజయపుర జిల్లా పరిధిలో 431 పాఠశాలలు నీట మునిగాయి. తాళాపురలో 50 కుటుంబీకులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలమేలు హోబళి తహసీల్దార్ దనపాల్ శెట్టి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



గర్భిణులను తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కలబురగి జిల్లాలో నీటమునిగిన పంటలు

మంత్రి ఖర్గే పర్యటన



గ్రామస్థులతో మాట్లాడుతున్న మంత్రి ఖర్గే

కలబురగి జిల్లా వ్యాప్తంగా వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. కలబురగి, బీదర్, యాదగిరి, రాయచూరు, కొప్పళ జిల్లాల్లో భారీ వర్షం కురుస్తోంది. బాగల్కోటె జిల్లాలో గోడకూలి 11ఏళ్ల బాలుడు దర్శన్ నాగప్ప లాథూర్ తీవ్రంగా గాయపడి చికిత్సలు ఫలించక శనివారం మృతి చెందాడు. శనివారం రబకవి బణహట్టి తాలూకా మహాలింగపుర గ్రామంలో వర్షం ధాటికి ఓ గోడ కూలింది. తెల్లవారుజామున 5 గంటలకు ఇంట్లో నిద్రిస్తున్న వేళ గోడ కూలడంతో దర్శన్ మృతి చెందగా అతడి సోదరుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కలబురగి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంకఖర్గే పలు ప్రాంతాల్లో పర్యటించారు. పంటనష్టంతోపాటు ఇబ్బంది పడుతున్న ప్రజలను రక్షించేలా సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 36 పునరావాస కేంద్రాలలో 1500మందికిపైగా ఆశ్రయం పొందుతున్నారన్నారు.

పంట నష్టం పై త్వరలో సర్వే

- ప్రతి రైతును ఆదుకుంటాం : మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్



మాట్లాడుతున్న మంత్రి పాటిల్

రాయచూరు సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జరిగిన పంటనష్టం పై సమగ్ర సర్వే నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లాధికారిని ఆదేశించామని రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డా.శరణ ప్రకాశ్ పాటీల్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖల మంత్రి దినేశ్ గుండురావ్‌తో కలిసి శనివారం జిల్లాలోని సింధనూరు నగరం సర్క్యూట్ గెస్ట్ హౌస్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ధాన్యం మినహా మిగితా పంటలన్ని నీట మునిగి నష్టానికి గురవుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి నివేదిక అందజేసేలా జిల్లాధికారిని ఆదేశించామన్నారు.

వరి రైతు విలవిల

- జోరువానలతో పెరిగిన తెగుళ్లు
- తేమశాతం పెరగడంతో పాడవుతున్న పైరు
- ఎదుగుదల ఆగిపోతోందని అన్నదాత ఆవేదన
- తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో మరింత ఆందోళన

బళ్లారి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు వరి రైతులను తెగుళ్లు వేదిస్తున్నాయి. పంటకు దుందానరోగం, రౌండ్‌వార్మ్ లీఫ్ స్పాట్ వ్యాధి సోకి పైరు ఎదుగుదలకు ఆటంకంగా మారిందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా తీవ్ర నష్టాలు వాటిల్లినట్లు తెలుస్తోంది. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాల్లో తుంగభద్ర జలాల కింద ఖరీఫ్‌లో రైతులు నాలుగు లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పంట సాగు చేసి 30 నుంచి 40 రోజులు కావస్తుంది. విస్తారంగా కురుస్తున్న వానలకు భూమిలో తేమశాతం పెరిగింది. పంటలకు కూడా శీతలం పెరిగి పైరు ఎర్రగా మారడం, రౌండ్‌వార్మ్ లీఫ్ స్పాట్ వ్యాధి, దందానరోగం సోకినట్లు తెలుస్తోంది. దీంతో ఎదుగుదల ఆగిపోయింది. వరి పైరు కంకి విడిచేసమయంలో ఈ రోగం సోకడం వల్ల కంకి కూడా ఎదగదు. ఫలితం దిగుబడి బాగా తగ్గే అవకాశం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు కూడా పైరు రక్షణకు అవసరం అయిన సూచనలు సలహాలు ఇస్తున్నారు. మేఘాలు కమ్ముకుని ఉండడం, ఎండ సరిగ్గా పైరు పై పడని కారణంగా భూమిలో తేమశాతం పెరిగింది. ఫలితంగా అతివృష్టి కారణంగా పైరు పాడు అవుతోందిన రైతులు దిగులు చెందుతున్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

వరినాట్లు వేశాక రైతులకు యూరియా కొరత ఏర్పడింది. యూరియా ఎక్కువ వాడడం వల్ల పంటకు, పొలం పై అనేక అనర్థాలు ఏర్పడుతాయని వ్యవసాయ శాస్త్రవేతలు సూచించారు. ముఖ్యంగా యూరియా మోతాదుకు మించి వాడుతుండడం వల్ల వరిధాన్యం గింజలు చన్నపడడం అవి తిన్న వారికి క్యాన్సర్ కూడా సోకే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రజాఆరోగ్యం, రైతుల భూరక్షణ కోసం ప్రభుత్వం యూరియా సరఫరా తగ్గించింది. కానీ రైతులు వరికి యూరియా అధికంగా వాడితేనే ఉపయోగకరమని భావిస్తున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేతలు కూడా యూరియా స్థానంలో నానో యూరియా వాడాలని రైతులకు సూచించారు.



తెగుళ్ల నివారణకు రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

తెగుళ్లు సోకడంతో రైతులకు దిగులు

వరి పైరుకు యూరియా లేని కారణంగా పైరు ఎదుగుదల కాలేదు. ఇప్పుడు అతివృష్టి కారణంగా ఉన్న పైరు కూడా రోగాలు పడడంతో పంట దిగుబడి పై ప్రభావం తీవ్రంగా పడతుందని రైతులు దిగులు చెందుతున్నారు. అతివృష్టి, వరికి తెగుళ్లు, యూరియా కొరత, ఇలా అనేక కారణాలతో వరి రైతులకు ఆవేదన తప్పడం లేదు.

చెత్త నిర్వహణ..!

- రోడ్లపై చెత్త పేరుకుపోవడంపై సీఎం ఆగ్రహం
- వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇంజనీర్లు ఇద్దరికి నోటీసులు
- రహదారులపై గోతులు పూడ్చాలని ఆదేశం
- సిద్దరామయ్య సిటీ రౌండ్స్‌తో అధికారుల పరుగో పరుగు

బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల కొన్ని రోజులుగా బెంగళూరు రోడ్లలో గుంతలపై తీవ్ర విమర్శలు వచ్చిన మేరకు సీఎం సిద్దరామయ్య శనివారం నగర పర్యటన చేపట్టారు. హెబ్బారు ఫ్లై ఓవర్ వద్ద నిర్మాణదశలోని వ్యర్థాలను రోడ్డుపైనే ఉండడంతో సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటలలో తొలగించాలని అధికారులను ఆదేశించారు. సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్ విభాగం సమగ్రంగా పర్యవేక్షించడం లేదని, బి స్మైల్ ఇంజనీర్‌లు రాఘవేంద్ర ప్రసాద్, ప్రహ్లాద్‌లకు నోటీసులు జారీ చేయాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. హెబ్బారు పరిధిలోని బాగలూరు రోడ్డులో వైట్‌ట్యాపింగ్ చేసేందుకు తవ్వకాలు జరిపి పనులు నత్తనడకన సాగడంపై మండిపడ్డారు. వైట్‌ట్యాపింగ్ శాశ్వతమైనదని, అయితే ఎంతకాలం ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తారన్నారు. పణత్తూరు టీ క్రాస్ పరిధిలో పలు చోట్ల చెత్తకుప్పలు రోడ్డుపై ఉండడంతో మార్షల్స్‌ను రంగంలోకి దించి వెంటనే తొలగించాలని సూచించారు. వర్షాకాలంలో గుంతలు ఏర్పడతాయని వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కాంట్రాక్టర్లను వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా విన్సర్‌మ్యానర్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు చేసి రోడ్లపై నీరు నిల్వలేకుండా చేయాలన్నారు. మెట్రో నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో సీఎం సిటీరౌండ్స్ నిర్వహించారు. సీఎం వెంట మంత్రి బైరతి సురేశ్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, బీబీఎంపీ ఇంజనీర్లు ఇతర అధికారులు ఉన్నారు. సీఎం పర్యటనతో అధికారులు పరుగులు పెట్టారు. కాగా డీసీఎం డీకే శివకుమార్ మాగడిరోడ్డులోని సుమనహళ్ళి ఫ్లై ఓవర్ రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. నాణ్యతను పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.



హెబ్బారు రోడ్డుపై నిర్మాణవ్యర్థాలను పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య

గోతులపై వినూత్న నిరసన

నగరంలో గోతులను పూడ్చాలని కాక్స్‌టౌన్‌లోని భారతినగర్ రెసిడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. గుంతల వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే బాగు చేయాలని కోరారు. ఈ సందర్భంగా గుంతలకు వినూత్న పూజలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.

కల్యాణ కర్ణాటక వైద్య శాఖకు రూ.857 కోట్లు: మంత్రి దినేశ గుండూరావ్

రాయచూరు సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రాంతంలో వైద్య శాఖను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం రూ.857 కోట్లు కేటాయించినట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండురావ్ తెలిపారు. శనివారం జిల్లాలోని సింధనూరు నగరంలో విలేకరులతో మాట్లాడిన మంత్రి, కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి నుంచి రూ.350 కోట్లు మిగతా రూ.500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. ఈ కేటాయింపులు చారిత్రాత్మకమైనవని గతంలో ఎన్నడు ఇంత భారీగా కేటాయింపులు జరగలేదని మంత్రి చెప్పుకొచ్చారు. కాగా జిల్లాలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు క్లష్టర్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు లింగసుగూరుకు క్రిటికల్ కేర్ ఆస్పత్రిని మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రాయచూరు జిల్లాలో కొత్తగా 16 భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. యాదగిరితో పాటు జిల్లాలో కొత్త ఆరోగ్య పథకాలకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సం చేస్తారన్నారు. బసవ కల్యాణ్, సింధనూరు ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అదనంగా 100 పడకలను సమకూర్చుస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు ఆస్పత్రిలో ఎంఆర్, సీటీ స్కాన్ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 1800 ఎంబీబీఎస్ వైద్యులను భర్తీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.





సిలిండర్ పేలుడుతో దెబ్బతిన్న ఇల్లు

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

- 8 మందికి గాయాలు ఒకరి పరిస్థితి విషమం
- విజయనగర జిల్లా గాదిగనూరులో ప్రమాదం
- బాధితులను పరామర్శించిన మంత్రి జమీర్

9



పాముకు ఎక్స్‌రే తీయిస్తున్న శివు

సన్‌స్క్రీన్ ట్యూబ్ మింగిన పాము

- శస్త్రచికిత్స చేసి కాపాడిన వైద్యులు
- సకాలంలో స్పందించిన స్నేక్ క్యాచర్ శివు
- రెండు వేలకు పైగా పాములను కాపాడిన యువకుడు

(వివరాలు మెయిన్‌లో)

తల్లీబిడ్డల మృతి

- వైద్యుడు, నర్సుపై బదిలీ వేటు
- కంప్లి ఆసుపత్రిలో మరోసారి విషాదం





మృతి చెందిన శిశువు చంద్రమ్మ (ఫైల్)

9

తరగతుల బహిష్కరణ

- లెక్చరర్లను నియమించాలని విద్యార్థుల డిమాండ్

బొమ్మల పండుగ



బొమ్మల కొలువును చూపుతున్న మల్లిక కుటుంబం

● జిల్లాలో పెరుగుతున్న బొమ్మలకొలువు సంప్రదాయం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగు రంగుల బొమ్మలు. అందులో వివిధ రూపాల్లోని దేవతలు, మనుషులు, పశుపక్ష్యాదుల బొమ్మలను అందంగా, ఓ క్రమపద్ధతిలో కొలువుదీర్చి చేసుకునే పండుగ బొమ్మల కొలువు. ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా బొమ్మల కొలువు నిర్వహించడం తరాలుగా వస్తున్న సంప్రదాయం. కాలనుగుణమైన మార్పుల్లో భాగంగా ఈ బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడానికి కాస్త గ్యాప్ వచ్చినా ఇటీవల ఈ కార్యక్రమాలు పలుచోట్ల ఊపందుకున్నాయి. అపార్ట్‌మెంట్ కల్చర్‌లోనూ ఇవి సామాజిక వేడుకల్లా మారాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి నవరాత్రులను శోభాయమానంగా జరుపుకుంటున్నారు.

40 వేల బొమ్మలతో...

నగరంలోని ఆర్‌కే నగర్‌కు చెందిన కెనరాబ్యాంకు విశ్రాంత ఉద్యోగి కమలాకర్, మల్లిక దంపతులు ప్రతి ఏటా బొమ్మల కొలువును వారి నివాసంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ 40వేలకు పైగా బొమ్మలను సేకరించారు. ప్రతి ఏటా దసరా నవరాత్రుల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి, దాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల వారిని ఆహ్వానిస్తున్నారు. వీరి సంప్రదాయాన్ని కుమారుడు నీలమేఘశ్యామ్, తేజశ్విని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకించి శ్రీకృష్ణలీలలు, మహాబలిపురం, సంపూర్ణ రామాయణం, టీటీడీ బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ, మయాబజార్ ఘటోత్కచుడి విందు, కంచి కామాక్షి ఊరేగింపు వంటి ఘట్టాలను బొమ్మలద్వారా కొలువుదీర్చారు. ఈసారి దసరా నవరాత్రుల్లో భాగంగా శివకోటి దేవాలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, రెండోరోడ్డులోని శ్రీ జ్ఞాన పీఠంలోనూ ప్రత్యేకంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు.

రూ.రెండు లక్షలకు పైగా వెచ్చించాం



ప్రతిఏటా బొమ్మలకొలువు ఏర్పాటు చేయడం మా ఇంటి సంప్రదాయం. ప్రతి ఏడాది కొత్త కొత్త బొమ్మలను ఉంచుతాం. ఇందుకోసమే ప్రత్యేకంగా ఇతర ప్రాంతాలకు విహారయాత్రలా వెళ్లి బొమ్మలను కొనుగోలు చేస్తాం. ఇప్పటివరకూ చెన్నై, బెంగళూరు, తంజావూరు, కొండపల్లి, హైదరాబాద్, అహ్మదాబాద్ ఇలా రకరకాల ప్రాంతాలనుంచి బొమ్మలు తీసుకొచ్చాం. ఇప్పటివరకూ రూ.2లక్షలకు పైగా బొమ్మల కోసమే ఖర్చు చేశాం. నవరాత్రుల్లో ప్రతిరోజూ స్థానిక మహిళలను ఇంటికి పిలిచి పేరంటాలు నిర్వహిస్తుంటాం. ఏడాదికేడాది మా ఇంటికి వచ్చి బొమ్మలకొలువును తిలకించేవారు పెరుగుతున్నారు.

– మల్లిక, బొమ్మలకొలువు నిర్వాహకురాలు



బొమ్మల కొలువులోని ఓ ఘట్టం



రామావతార ఘట్టాలు



శ్రీకృష్ణావతారం..

గుమ్మఘట్ట ఎంఈఓ-2కు షోకాజ్ నోటీసు

అనంతపురం విద్య, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రకు ఆర్జేడీ శామ్యూల్ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అర్హత లేకున్నా తన భార్యకు అసిస్టెంట్ ఐఈడీ పోస్టు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, పత్రికలు, సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ ఫిర్యాదు చేయడంతో ఆయనను ఆర్జేడీ వివరణ కోరారు. ఏపీసీ శైలజను వేధిస్తున్నారని, విధులకు సరిగా వెళ్లడంలేదని ఆధారాలతో లీప్ యాప్‌లో ఫిర్యాదులు వచ్చినట్లు షోకాజ్ నోటీసులలో పేర్కొన్నారు. వీటిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులు వచ్చిన విషయాన్ని ఎంఈఓ-2 రామచంద్ర ధ్రువీకరించారు. ఈ వ్యవహారం విద్యాశాఖ వర్గాలలో తీవ్ర దుమారం రేపుతోంది.

పీజీలో 213 మంది చేరిక

అనంతపురం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మొదటి విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. మూడు రోజుల క్రితం అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టారు. రెగ్యులర్ 207 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కింద 61 సీట్లు, పేమెంట్ సీట్లు 60 కలిపి 328 సీట్లు వర్సిటీకి కేటాయించారు. ఇందులో 213 భర్తీ అయ్యాయి. మరో 115 భర్తీ కావాల్సి ఉంది. తొలివిడత కెమిస్ట్రీలో 29 మంది, అప్లైయిడ్ మ్యాథమ్యాటిక్స్‌లో ముగ్గురు, మ్యాథమ్యాటిక్స్ ఐదుగురు, బయోకెమిస్ట్రీ 11 మంది, బయో టెక్నాలజీ 12 మంది, బాటనీ 9 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ నలుగురు, జాగ్రఫీ ముగ్గురు, మైక్రో బయాలజీ 12 మంది, ఫిజిక్స్‌లో ఆరుగురు, పాలిమర్ సైన్స్‌లో ఒక్కరు, సెరికల్చర్‌లో ఆరుగురు, స్టాటిస్టిక్స్ నలుగురు, జువాలజీలో 12 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఐదుగురు, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 15మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 19 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఒకరు అడ్మిషన్ పొందారు. మొదటి విడతలో ఎక్కువగా సైన్స్ సీట్లు భర్తీ అయ్యాయి. సైన్స్‌లో 157 మంది, ఆర్ట్స్‌లో 56 మంది చేరారు. రెండో విడత అడ్మిషన్‌లు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

కూలిన మృత్యువు..!

● ఇంటి ఎలివేషన్ కూలి వ్యక్తి దుర్మరణం



ఎలివేషన్ కూలడంతో ద్విచక్రవాహనంపైనే మృతి చెందిన వెంకటరాముడు

గుంతకల్లు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా..! మార్కెట్‌కు వెళ్లి దుకాణంలోకి అవసరమైన కాయగూరలు తెస్తా' అని తల్లికి చెప్పి బయటకు వెళ్లిన వెంకటరాముడు (59) తిరిగి ఇంటికి రాకుండానే మృత్యు ఒడికి చేరిన ఘటన గుంతకల్లులో శనివారం జరిగింది. గుంతకల్లులోని ఏకలవ్యనగర్‌కు చెందిన వెంకటరాముడు కిరాణా అంగడిని నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే అంగడికి అవసరమైన సరుకుల కోసం మార్కెట్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అక్కడ అవసరమైన కాయగూరలు కొని వాహనంపై పెట్టుకుని 11:45 సమయంలో ఇంటికి బయల్దేరాడు. ఇది ఇలా ఉండగా మార్కెట్ సమీపంలో ఉన్న పాత భవనాన్ని కూల్చడానికి ఇంటి యజమాని కూలీలతో పైకప్పును పాక్షికంగా తొలగించాడు. అయితే భవనం వర్షానికి నానడం, పైకప్పునకు సపోర్టు లేకపోవడంతో ఇంటి ముందుభాగం (ఎలివేషన్) హఠాత్తుగా కూలింది. ఇదే సమయంలో ద్విచక్రవాహనంపై కూరగాయల సంచులతో అటు వెళ్తున్న వెంకటరాముడిపై పడింది. ఎలివేషన్‌లోని బరువైన సిమెంటు పెల్లలు పడటంతో వెంకటరాముడి తల, ముఖం ఛిద్రమైపోయాయి. ఎలివేషన్ బరువుకు ద్విచక్ర వాహనంపై కూర్చున్న వ్యక్తి కూర్చున్నట్లుగానే మృతిచెందాడు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న తల్లి, భార్య, కుమారుడు, బంధువులు బోరున విలపించారు. 'సంతకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరి వచ్చి, కనీసం ముఖం చూడటానికి కూడా వీల్లేని విధంగా మమ్మల్ని విడిచిపోయావా' అంటూ బోరున విలపించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రావుడి అంజన్నకు ప్రత్యేక పూజలు

అగళి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుడి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. మహిళలు హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆంజనేయస్వామికి సింధూరంతో అభిషేకం చేసి ఆకుపూజ అలంకరణ చేశారు.



హనుమద్వాహనంపై శ్రీవారు



హనుమద్వాహనంపై దేవదేవుడు

అలరించిన 'శ్రీనివాస కల్యాణం'

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం శ్రీనివాసుడు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చనలు, తోమాలసేవలు, అలంకారసేవలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నవగ్రహ, దీక్షాహోమాలను నిర్వహించారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన హనుమద్వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలోని వేదికపై కళాకారులు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం ఎంతగానో ఆకట్టుకుంది.



శ్రీనివాస కల్యాణం.. నృత్య రూపకం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

జీఎస్టీ లబ్ధిపై అవగాహన కల్పించండి

అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. జేసీ శివనారాయణ శర్మ, పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్ వల్లి, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, డ్వామా పీడీ సలీం బాషా, వివిధ శాఖల అధికారులతో తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో తెలియజేసేందుకు అక్టోబరు 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. జీఎస్టీ క్యాంపెయిన్‌కు జిల్లా నోడల్ అధికారిగా జేసీ ఉంటారని, మండల, మున్సిపల్ స్థాయిలో ఇతర శాఖల అధికారులతో కమర్షియల్ టాక్స్ అధికారులు సమన్వయం చేసుకుని అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కూడా జీఎస్టీ గురించి తెలియజేయాలని అన్నారు.

ఇనుప ఖనిజం చోరీపై విచారణ

'కాలవ' వినతికి మంత్రి కొల్లు రవీంద్ర హామీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజక వర్గంలోని ఓబుళాపురం గనుల్లో ఇనుప ఖనిజం చోరీపై విచారణ జరిపిస్తామని గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్ర శాసనసభలో శనివారం తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 2019-24 మధ్యకాలంలో ఓబుళాపురం గనుల నుంచి సుమారు లక్ష టన్నుల ఇనుప ఖనిజాన్ని వైసీపీ నాయకులు అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయన్నారు. వాటి విలువ రూ.30 కోట్ల మేర ఉంటుందని పత్రికల్లో వార్తలొచ్చాయన్నారు. ఈ విషయంలో నిజానిజాలు వెలికితీయడానికి సమగ్ర విచారణ అవసరమని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కొందరు సీబీఐ సీజ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా... రెండుసార్లు పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారన్నారు. గతంలో ఓఎంసీకి వాహనాలు సరఫరా చేసిన వ్యక్తే ఈ చర్యలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారన్నారు. ఇనుప ఖనిజం దోపిడీదారులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులను తప్పక శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీసేలా దుష్ప్రచారం సాగిస్తున్న వారి వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. భిన్న రాజకీయ పార్టీల నాయకుల సోషల్‌మీడియా దుష్ప్రచారాన్ని ఆధారాలతో ఆయన మంత్రికి వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ... ఇనుప ఖనిజం చోరీపై సమగ్ర విచారణ చేయిస్తామని సభలో హామీ ఇచ్చారు.

మూడేళ్ల కిందటే అక్రమ రవాణా: డీఎఫ్ఓ



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

రాయదుర్గం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కొండల్లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ముడిఖనిజాన్ని మూడేళ్ల కిందటే అక్రమ రవాణా చేసినట్లు గుర్తించామని డీఎఫ్ఓ చక్రపాణి స్పష్టం చేశారు. రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డిప్యూటీ రేంజ్ అధికారి దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన మైనింగ్ కొండల్లో శనివారం పర్యటించారు. బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్ అటు కర్ణాటక ఇటు ఆంధ్ర సరిహద్దుల్లో ఉంటుందన్నారు. ఈ ప్రాంతాన్ని వివాదాస్పద ప్రాంతంగా 15 ఏళ్లకు ప్రకటించి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. 2009లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల రెండు టిప్పర్లు అక్రమంగా ఖనిజాన్ని తరలించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా సీబీఐ సీజ్ చేసిన ముడిఖనిజం ఎవరికి అప్పగించారన్న విషయం తేలాల్సి ఉందన్నారు.

టమోటా కిలో రూ.19

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం టమోటా కిలో రూ.19తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో అమ్మకాలు జరిగాయన్నారు. మార్కెట్ మొత్తంగా 3వేల టన్నుల కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

సిలిండర్ డెలివరీలో అవకతవకలు

రూ.10వేలు జరిమానా విధించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్యాస్ వినియోగదారుల ఫిర్యాదులతో తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు చేశారు. డెలివరీ వాహనంలో తూకం వేసే మిషన్ లేకపోవడంతో పాటు గ్యాస్ సరఫరా ధ్రువీకరణ పత్రం చూపించేలేక గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం బయటపడింది. దీంతో ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ.10 వేలు జరిమాన విధించారు. సిలిండర్ ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మరోసారి తూకం లేకుండా సిలిండర్లు డెలివరీ చేస్తే ఏజెన్సీ రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

వైసీపీ డిజిటల్ బుక్ ప్రారంభం



డిజిటల్ బుక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులపై భవిష్యత్తులో చర్యలు ఖాయమని హెచ్చరించారు. ఎవరికి అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. బాధితులు డీటీడబ్ల్యూఈవైఎస్ఆర్‌సీపీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని తెలిపారు. 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నియోజకవర్గ కేంద్రాల్లో, 29న మండల స్థాయిలో డిజిటల్ బుక్ ఓపెన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌లో బాలకృష్ణ పేరు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఓ ఉన్మాది అని, అతడికి మతిస్థిమితం లేదని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. బాలకృష్ణ పేరు ఇప్పటికే డిజిటల్ బుక్‌లో నమోదైందని అన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించలేదని అన్నారు.

కల్తీకల్లు విక్రయిస్తే పీడీయాక్ట్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


హిందూపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎవరైనా కల్తీకల్లు విక్రయిస్తే వారిపై పీడీయాక్ట్ కేసు నమోదుచేసి జైలుకు పంపుతామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. శనివారం ఏసీ శ్రీరామ్‌తో కలిసి హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టువద్ద ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి ఆంధ్రకు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వెంటనే వేలం వేయాలన్నారు. కల్లు దుకాణాల నుంచి శాంపుల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపాలన్నారు. ఎవరైనా కల్తీకల్లు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పాత ముద్దాయిలను, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. ఒక వ్యక్తిపై రెండుకు మించి కేసులుంటే పీడీయాక్ట్ నమోదు చేయాలన్నారు. ఎక్కువ కేసులున్న వ్యక్తులపై జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకోవాలన్నారు. దసరా, గాంధీ జయంతి సందర్భంగా అదనపు బలగాలతో గస్తీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మీదుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర టౌన్/రూరల్ (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు విక్రయిస్తే పీడీయాక్ట్ తప్పదని అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీ నాగమద్దయ్య తెలిపారు. కల్తీకల్లు అరికట్టేలా కల్లు అమ్మకందారులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. శనివారం మడకశిరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఏసీ శ్రీరాంతో పర్యటించారు. ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయిస్తున్నారా..? లేదా..? అన్న అంశాలను పరిశీలించాలన్నారు. ఎక్కడ కూడా నాటుసారా తయారుకాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కన్ఫ్యూసియస్ (జయంతి)



చైనా దేశానికి చెందిన తత్వవేత్త కన్ఫ్యూసియస్ క్రీస్తుపూర్వం 551 సెప్టెంబరు 28న జన్మించారు. ఉపాధ్యాయుడిగానే కాక, రాజకీయనేతగా రాణించారు. ఆయన బోధనలు కన్ఫ్యూసియనిజమ్‌గా ప్రసిద్ధి చెందాయి. మతాలతో నిమిత్తం లేకుండా ఆయన బోధనలు క్రీస్తుపూర్వం 5వ, 6వ శతాబ్దాలలో సైతం ప్రేమ, మానవత్వాన్ని ప్రబోధించేలా ప్రభావితం చేశాయి. ఆయన ప్రతిపాదించినవి గోల్డెన్ రూల్‌గా పేరొందాయి. క్రీస్తుపూర్వం 479 ఏప్రిల్ 11న కన్నుమూశారు.

గుర్రం జాషువా (జయంతి)



ఆధునిక తెలుగు కవి, పద్మ భూషణ్ గ్రహీత గుర్రం జాషువా 1895 సెప్టెంబరు 28న గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. సమాజంలో మూఢాచారాలపై కవిత్వం ద్వారా పోరాటం చేశారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగాను, అనంతరం మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగాను వ్యవహరించారు. 36 గ్రంథాలు, ఎన్నో కవితా ఖండికలు రాశారు. గబ్బిలం, ఫిరదౌసి వంటి రచనలు ప్రసిద్ధి చెందాయి. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో సభ్యుడయ్యారు. కవి దిగ్గజ, కవి కోకిల, నవయుగ కవిచక్రవర్తి, సాహిత్య అకాడమీ వంటి పురస్కారాలు పొందారు. 1971 జూలై 24న కన్నుమూశారు.

భగత్‌సింగ్ (జయంతి)



'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదంతో వీరత్వానికి మారుపేరుగా నిలిచిన భరతమాత ముద్దుబిడ్డ భగత్‌సింగ్ 1907 సెప్టెంబరు 28న (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) పంజాబ్ ప్రాంతం లాయల్ జిల్లా బంగాలో జన్మించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తనదైన సత్తాను చాటుకున్నారు. బ్రిటీష్‌వారిపై పోరాడేలా యువతను ప్రేరేపించారు. ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచారు. ఉద్యమకారుడిగా, జాతీయ నాయకుడిగా ప్రజల హృదయాల్లో నిలిచారు. 1931 మార్చి 23న ఉరి తీయబడ్డారు. బలిదానంతో అమరవీరుడిగా గుర్తింపు పొందారు. 1968లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంప్ విడుదలైంది.

లతా మంగేష్కర్ (జయంతి)



దేశం మెచ్చిన గాయనీమణి. 'భారతరత్న' వంటి అత్యున్నత పురస్కారం అందుకున్న నేపథ్య గాయని లతా మంగేష్కర్ 1929 సెప్టెంబరు 28న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జన్మించారు. హిందీతోపాటు 36 ప్రాంతీయ, విదేశీ భాషలలో 50వేలకుపైగా పాటలు పాడారు. 'ది నైటింగేల్ ఆఫ్ బాలీవుడ్'గా పేరొందారు. రాయల్ అల్బెర్ట్‌హాల్‌లో తొలిసారి పాడిన గాయని. దాదా సాహెబ్ ఫాల్కే, పద్మ విభూషణ్, పద్మభూషణ్, కాళిదాస్ సమ్మాన్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2001లో తండ్రి దీనానాథ్ మంగేష్కర్ జ్ఞాపకార్థం 800 పడకల సామర్థ్యం కల్గిన మల్టిస్పెషాలిటీ, పరిశోధనా చారిటీ ఆసుపత్రి ఏర్పాటు చేశారు. 2022 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

పూరి జగన్నాథ్ (పుట్టినరోజు)



దర్శకుడు పూరి జగన్నాథ్ 1966 సెప్టెంబరు 28న కాకినాడ జిల్లా పిఠాపురంలో జన్మించారు. టాలీవుడ్‌లో స్క్రీన్‌రైటర్‌గా, నిర్మాతగా, డైనమిక్ డైరెక్టర్‌గా రాణించారు. విభిన్న క్యారెక్టర్‌లు, భిన్నమైన ఫిల్మ్‌మేకింగ్‌లో పేరొందారు. బద్రి, ఇడియట్, శివమణి, పోకిరి, చిరుత తదితర సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. వైష్ణో అకాడమీ, పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్‌లతో సొంతంగా ప్రొడక్షన్స్ కంపెనీ ఏర్పాటు చేశారు. 2002లో కన్నడలో పునీత్ రాజ్‌కుమార్ హీరోగా 'అప్పు' సినిమా తీశారు. సొంతంగా మ్యూజిక్ కంపెనీని 'పూరి సంగీత'ను ఏర్పాటు చేశారు.

రణబీర్ కపూర్ (పుట్టినరోజు)



బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్ 1982 సెప్టెంబరు 28న జన్మించారు. రాజ్‌కపూర్ మనుమడు. 2012లో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటులలో ఒకరిగా నిలిచారు. 6 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. నటుడిగానే కాకుండా ఫుట్‌బాల్ క్రీడపట్ల ఆసక్తితో పలు చారిటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆల్‌స్టార్స్ ఫుట్‌బాల్ క్లబ్ వైస్-కేప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ సూపర్‌లీగ్ ఫుట్‌బాల్ జట్టు ముంబై ఎఫ్‌సికి కో-ఓనర్‌గా ఉన్నారు. నటి అలియాభట్‌ను వివాహమాడారు.

అభినవ్ బింద్రా (పుట్టినరోజు)



ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్, 'పద్మ భూషణ్' గ్రహీత అభినవ్ బింద్రా 1982 సెప్టెంబరు 28న డెహ్రాడూన్‌లో జన్మించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో 9 బంగారు పతకాలు, ఏషియన్ గేమ్స్‌లో 3 బంగారు పతకాలు సాధించారు. 22ఏళ్లకే 150 పతకాలు సాధించిన ఘనత. అర్జున అవార్డు, రాజీవ్ ఖేల్‌రత్న పురస్కారాలు అందుకున్నారు. హానరరీ లెఫ్టినెంట్ కల్నల్ గౌరవం అందుకున్నారు. క్రీడల ప్రోత్సాహానికి తనవంతుగా స్వచ్ఛందసంస్థను ఏర్పాటు చేశారు. ఐఓసి అథ్లెట్స్ కమిషన్‌లో సభ్యుడిగా ఉన్నారు.

సర్వేలో సమస్యలను పరిష్కరించండి

» తహసీల్దార్‌కు ఉపాధ్యాయుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుల బృందం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో సాగుతున్న సామాజిక, విద్య సమీక్ష (కులగణన సర్వే)లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎన్యూమరేటర్లుగా ఉన్న ఉపాధ్యాయులు కోరారు. తహసీల్దార్ గగనసింధుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తాలూకా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షురాలు సరస్వతమ్మ మీడియాతో మాట్లాడుతూ సర్వే వేళ మ్యాపింగ్ కావడం లేదని, సర్వర్ సమస్య ఉందని ఇలా సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రత్యేకించి ముస్లింలు ఉంటున్న ప్రాంతాలలో సర్వే ఇబ్బందికరంగా ఉందన్నారు. వారికి కన్నడ రాదని, ఉపాధ్యాయులకు ఉర్దూ రాదని, ఇలా భాషా సమస్య ఎదుర్కొంటున్నామన్నారు. పలుచోట్ల వ్యక్తిగత యాప్ కోసం మొబైల్ నెట్ ఉపయోగించుకోవాల్సి ఉంటోందన్నారు. కొందరు ఉపాధ్యాయులకు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేదన్నారు. యూహెచ్ఐడీ సంఖ్యలు అప్పియర్ కావడం లేదన్నారు. యాప్ పనితీరుకు సంబంధించి సహాయవాణిని ఏర్పాటు చేయాలన్నారు. 20-30 కిలోమీటర్లు వెళ్లి భాష తెలియని ప్రదేశానికి విధులు కేటాయిస్తే సర్వే ఎలా చేయాలన్నారు. యూహెచ్ఐడీ సంఖ్యలతోపాటు డోర్ నెంబరు నమోదు చేసి ఉంటే ప్రక్రియ సులభతరం అయ్యేదన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా సర్వేకు గడువు పెంచాలని, గౌరవధనం, భత్యాలకు సంబంధించి తగిన రీతిలో సెలవు మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ గగనసింధు మాట్లాడుతూ సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా అధికారి సూచన మేరకు ఎన్యూమరేటర్లు అందరూ విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. బీఈఓ నరేంద్రకుమార్, తాలూకా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి సుందరాచారి, మంజునాథ్, సుదర్శన్, శీనప్ప పాల్గొన్నారు.

చదువుతోపాటు సమాజం గురించి ఆలోచించాలి

» విద్యార్థులకు గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్ పిలుపు



పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్

బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు సమాజం గురించి తెలుసుకోవాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి ఉత్తమంగా ఎదిగేందుకు తల్లిదండ్రులు, గురువుల మార్గదర్శకాలు కీలకంగా ఉంటాయని, వాటిని ఎప్పుడూ విస్మరించరాదన్నారు. సెయింట్‌జోసెఫ్ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ జాతినిర్మాణంలో మానవత్వంతో సేవలు అందించాలన్నారు. ఉన్నతవిద్యావంతులకు ప్రపంచమే కుగ్రామంగా మారిందని, ఎక్కడైనా ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యతే కీలకమన్నారు. ఉద్యోగాలకంటే పరిశోధనలవైపు దృష్టి సారించాలని యువ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ మాట్లాడుతూ అవకాశాలు మీ ఇంటి తలుపులు తట్టవని, మీలో నైపుణ్యత ప్రతిభ ఉంటే ఎక్కడైనా రాణిస్తారన్నారు. ఆ స్థాయికి చేరుకునేందుకు కఠోర పరిశ్రమ అవసరమన్నారు. కులపతి రెవరెండ్ ఫాదర్ డయోనిసిస్‌వాజ్ మాట్లాడుతూ 2747 మంది విద్యార్థులు పట్టాలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో 2099 డిగ్రీ, 738 మంది పీజీ విద్యార్థులు ఉన్నారన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ విక్టర్ లోబో, వివిధ విభాగాల రిజిస్ట్రార్‌లు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. 1822 లో స్థాపించి సెయింట్ జోసెఫ్ సంస్థ 143వ వార్షికోత్సవాన్ని ఆచరించారు.

పరిశ్రమలకు సాంకేతిక నైపుణ్యత కీలకం

» విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి ఏవీఎస్ రమేశ్‌చంద్ర



సీఎంఆర్‌ఐటీ ఫ్రెషర్స్‌డేలో ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యత కల్గిన మానవ వనరులు కీలకమని, ఆ దిశగా విద్యాసంస్థలు బోధనలు కొనసాగించాలని కేంద్రప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ ఏవీఎస్ రమేశ్‌చంద్ర అభిప్రాయపడ్డారు. సీఎంఆర్‌ఐటీ 2025-26 సంవత్సరానికి సంబంధించి ఫ్రెషర్స్ డేను శనివారం జరిపారు. రమేశ్‌చంద్ర విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆత్మనిర్భర భారత్ సాధనకు కేంద్రప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాంకేతిక విద్యలో కేవలం ఉద్యోగాలకోసం కాకుండా యువత స్టార్టప్‌లు, కొత్త ఆలోచనలతో ముందుకెళ్లేందుకు ఇదే మంచి తరుణమన్నారు. డేటాసైన్స్, మిషన్ లర్నింగ్ విభాగాలలో మరిన్ని హాకథాన్‌లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రాఫిచ్ హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ రమ్యా హెమ్మిగ వెంకటేశ్ మాట్లాడుతూ విద్య అనేది శక్తివంతమైన అస్త్రమని, నైపుణ్యం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పొందిస్తుం దన్నారు. చదువుకునే రోజుల్లో మరో ఆలోచన రాకూడదని సూచించారు. అకడమిక్‌తోపాటు కొత్త అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ కేసీ రామమూర్తి 126మంది ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రదానం చేశారు. సీఎంఆర్ ట్రస్టు కార్యదర్శి జగన్నాథరెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్‌జైన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో సీఎం పర్యటన



సీఎంను స్వాగతిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మహదేవపుర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన నగర ప్రదక్షిణలో భాగంగా మహదేవపుర నియోజకవర్గాన్ని శనివారం పర్యటించారు. పణత్తూరు రైల్వే బ్రిడ్జ్ విబ్జియార్ రోడ్డు, టీ జంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే మంజుళా లింబావళి సమస్యలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అంతకు ముందు సీఎంను ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ పలు వార్డులు, పంచాయతీల రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, సంచారానికి వీలు కల్పించాలని విన్నవించామన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దొడ్డజాల ముత్యాలమ్మదేవికి పూర్ణకుంభ అలంకరణ



చేళూరులో వాసవీమాతకు అనంతపద్మనాభస్వామి అలంకరణ



చామరాజపేట వాసవీమాతకు నాగవల్లి అలంకరణ

లక్ష్యంతో చదవండి .. భవిష్యత్తు మీదే

» హిందూస్థాన్ టెక్నాలజీ గ్రూప్ ఈఓ మనోజ్‌కుమార్



ఫ్రెషర్స్‌డేలో హిందూస్థాన్ టెక్నాలజీ గ్రూప్ ఈఓ మనోజ్‌కుమార్

బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో చదివితే భవిష్యత్తు మీరు కోరుకున్న స్థాయికి చేరుకోవచ్చునని హిందూస్థాన్ టెక్నాలజీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణదేవరాయ విద్యాసంస్థ విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను శనివారం జరిపారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థికదేశం అయ్యేందుకు కొంతకాలమే వ్యవధి ఉందని, యువత సాంకేతిక విద్యలో రాణించి దేశం కోసం పాటుపడాలన్నారు. మార్కులకంటే జ్ఞానం పెంచుకోవాలని, ఆధునికత, పరిశోధన, నైపుణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యాసంస్థ ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రపంచంలో భారత్‌లోనే అత్యధికమంది యువత ఉన్నారని, అదే దేశాభివృద్ధికి మార్గదర్శకం కావాలన్నారు. ఫౌండర్ ట్రస్టీ, అకడమిక్ చైర్మన్ కేవీ శేఖర్‌రాజులు ర్యాంకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. నవ్య రాజు, ట్రస్టు సభ్యులు నారాయణరాజు, చంద్రశేఖరరాజు, ప్రిన్సిపాల్ రాకేశ్, వైస్‌ప్రిన్సిపాల్ భారతిగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌లోకి పలువురి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో చేరిన స్థానిక ప్రముఖులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సాదలి గ్రామంలో ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ సమక్షంలో పలువురు జేడీఎస్‌లో చేరారు. సవితా సామాజికవర్గానికి చెందిన 20కుపైగా కుటుంబాలవారు చేరారు. వారిని ఎమ్మెల్యే పూలహార, శాలువాతో సత్కరించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దుస్థితిలో ఉన్న గడిమించనహళ్ళిరోడ్డు, సాదలి - పెరేసంద్ర మెయిన్‌రోడ్డు అభివృద్ధికి చొరవ చూపడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు బంకు మునియప్ప, జేడీఎస్ నాయకుడు తాదూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ స్వామి మఠంలో ఒడినింపే కార్యక్రమం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలల్లో భాగంగా శ్రీదేవి పురాణం సందర్భంగా శుక్రవారం నగరంలోని కల్యాణస్వామి మఠంలో ముత్తైదువులకు ఒడినింపే కార్యమం చేపట్టారు. మరియమ్మనహళ్ళికి చెందిన మల్లికార్జున శివాచార్య మహాస్వామి, ఆలుగోలుకు చెందిన మహంత స్వామీజీ , నగరంలోని కల్యాణ మఠానికి చెందిన కల్యాణ స్వామి మాట్లాడుతూ మహిళలు జీవితంలో సామరస్యం ద్వారానే ఆనందం పొందాలని,వారి కుటుంబాలలో శుభం సాధించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ లత మాట్లాడుతూ సమాజంలో మనసుల పరివర్తనకు కేంద్రం జైలు ఒకటి అన్నారు. నేరాలు చేసినా తర్వాత పరివర్తన చెంది పరిపూర్ణ మనుషులుగా బయటికి రావాలన్నారు. ధర్మం ఆచరిస్తే ఎన్నటికైనా తిరిగి మంచి రోజులు వస్తాయన్నారు. పురాణ ప్రసంగాన్ని శ్రీనివాస్ మూర్తి,చెన్నవీరయ్య సారంగ్ మఠం, తబలా రాఘవేంద్ర , యోగా సంస్థ అధ్యక్షుడు లక్ష్మీ మంజునాథ్, నాగమ్మ, శిల్ప, జడేశ్ పాల్గొన్నారు.

ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షురాలిగా ఉమారెడ్డి

» 108 ఏళ్లలో తొలిసారి మహిళకు అవకాశం



బెంగళూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌కేసీసీఐ) అధ్యక్షురాలిగా ఉమారెడ్డి ఎంపికయ్యారు. సర్ ఎం విశ్వేశ్వరయ్య 108 ఏళ్లక్రితం స్థాపించిన ఎఫ్‌కేసీసీఐకు తొలిసారిగా ఒక మహిళ అధ్యక్షురాలిగా ఎంపిక కావడం గమనార్హం. ఎంఎస్ఎంఈ రంగం బలోపేతానికి మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్న ఉమారెడ్డికి ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షురాలిగా అవకాశం దక్కించుకున్నారు. ఇంజనీరింగ్, ఐటీ సేవలు, దుస్తులు, ఆహార సంస్కరణలు, చేతి వస్తువుల రంగాలలోనూ మహిళలు ముందంజలో ఉన్నారు. ఎఫ్‌కేసీసీఐలో 5వేలమందికి పైగా నేరుగా సభ్యులు, పరోక్షంగా 20వేలమంది ఉన్నారు. 200మందికిపైగా వ్యాపార, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు ఉన్నారు. కాగా ఎఫ్‌కేసీసీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లుగా సాయిరాం ప్రసాద్, బీపీ శశిధర్ ఎంపికయ్యారు.

మౌలిక సదుపాయాలకై సీపీఎం నిరసన



పీడీఓకు వినతిపత్రం అందజేత

బాగేపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని 16 గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఎం చిక్కబళ్ళాపుర జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం కార్యకర్తలు నాయకులు పెద్దసంఖ్యలో చేరారు. గ్రామ పంచాయతీ పీడీఓ నారాయణస్వామికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఎం తాలూకా నాయకుడు డీటీ మునిస్వామి మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇళ్లులేనివారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. జాతీయ గ్రామీన ఉపాధి హామీ పథకంలో నిజమైన కూలీలకు అవకాశం కల్పించాలన్నారు. నిరసనలో అశ్వత్థనారాయణ, చన్నరాయప్ప, రామలింగప్ప, మునియప్ప, ఇమ్రాన్, గౌనిపల్లి, నాగరాజప్ప, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టర్మినల్‌మాల్‌లో మధురై రుచులు

మహదేవపుర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక హూడి అయ్యప్ప నగర్ మెయిన్‌రోడ్డులోని టర్మినల్‌మాల్‌లో మధురై రుచులు అందుబాటులోకి వచ్చాయి. మధురైబన్ పరోటాహట్ హోటల్‌ను మాజీ మంత్రి అరవింద లింబావళి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శాకాహార, మాంసాహార ప్రియులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి మంచి పేరు తెచ్చుకోవాలని అభిలషించారు. హోటల్ యజమాని స్టీఫెన్, బీజేపీ రూరల్ అధ్యక్షుడు పిళ్ళప్ప, అశ్వత్థనగర్ మంజునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ



విశేషపూజల్లో ఎంకే వాసుదేవ్ తదితరులు

ముళబాగిలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల సంస్థ ధార్మిక కార్యక్రమాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతూ ప్రజల ఆదరణ పొందుతున్నాయని మామిడి అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు ఎంకే వాసుదేవ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ధర్మస్థల సంస్థ యోజనాధికారి కార్యాలయంలో ఆయుధపూజ, వివిధ హోమాలు సాగాయి. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి, మహిళల స్వావలంబన కోసం ధర్మస్థల సంస్థ పాటుపడుతోందన్నారు. పర్యావరణ సంరక్షన, చెరువుల అభివృద్ధి, ప్రతిభావంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, దివ్యాంగులకు సహాయధనం, పాలడెయిరీల నిర్మాణాలకు, ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తున్నాయన్నారు. సంస్థ తాలూకా యోజనాధికారి హరీశ్‌కుమార్ మాట్లాడుతూ జమ్మనహళ్ళిగేట్ సమీపానగల ఓంశక్తి ఆలయంలో లోకకల్యాణార్థం హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేపీ నగర్‌లో అలరిస్తున్న బొమ్మలకొలువు



బొమ్మల కొలువులో స్థానికులు

బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ అంటేనే వివిధ రకాల పూజలు, కొలువులు, సాంస్కృతిక సంబరాలకు వేదికగా ఉంటుంది. జేపీ నగర్‌లోని రూపశ్రీ ఇంట్లో దసరా బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఏటా బొమ్మల కొలువు నిర్వహిస్తామని పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయమని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ పూజలు ప్రసాద వినియోగం చేస్తామన్నారు.


బంగారు చీరతో వాసవీమాత


లక్ష్మీవెంకటేశ్వరాలయంలో..



శ్రీవారి అలంకారంలో చిన్నదుర్గమ్మ


పూజలందుకుంటున్న తాయమ్మ దేవి


శ్రీరామాశ్రమంలో గాయత్రిదేవి


బెంకి మారెమ్మకు గంధం అలంకరణ

శ్రీవారి రూపంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ


అలంకరణలో అభయ ఆంజనేయ స్వామి

బళ్లారి సిటీ/రూరల్/కంప్లి సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల్లో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆరవ రోజు శనివారం నగరంలోని కన్యకాపరమేశ్వర ఆలయంలో అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. లక్ష్మీవెంకటేశ్వర కల్యాణమంటపంలో వెంకటేశ్వరుని అలంకారం.పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మ ఆలయంలో చిన్నదుర్గంకు వెంకటేశ్వర అలంకారం. మోతిసర్కిల్లో ఏళుమక్కల ఆలయంలో తాయమ్మదేవికి విశేషఅలంకార పూజలు. నగరంలోని అహంబావి శ్రీరామాశ్రమంలో గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చింది.

● గ్రామాల్లో నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కంప్లి పట్టణంలోని బసవేశ్వరాలయంలో చేళగుర్కి యర్రితాత, కాళికాదేవి ఆలయం అమ్మవారిని ఆకుపూజలతో ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయలు కాలం నాటి వెంకటరమణ ఆలయంలో బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణోత్సవం పురోహితులు నవీన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.


వెంకటరమణ ఆలయంలో శ్రీవారి కల్యాణం

● నగరంలోని విద్యానగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో లలిత త్రిపుర సుందరిదేవికి విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు బోయపాటి విష్ణువర్దన్ తెలిపారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో నవరాత్రి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.


లలితా త్రిపుర సుందరీ దేవి

తరగతుల బహిష్కరణ

● కళాశాలల్లో అతిథి లెక్చరర్లను నియమించాలని విద్యార్థుల డిమాండ్ ● ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో ఆందోళన



నిరసనలో విద్యార్థులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కళాశాలలల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం తరగతులు బహిష్కరించారు. ఏఐడీఎస్‌ఓ సంఘ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తందగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించాలని డిగ్రీ విద్యార్థులు పోరాటానికి పిలుపు నిచ్చారు.ఈ నేపథ్యంలో బళ్లారి నగరంలోని సరళాదేవి కళాశాల, సిటీ కళాశాల ప్రభుత్వ మహిళా కళాశాలలు తరగతులను పూర్తిగా బహిష్కరించారు. ఈసందర్భంగా ఏఐడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి కంబాలి మంజునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థపై వివక్ష చూపుతోందని, సెమిస్టర్ పరీక్షలకు సిద్ధమవుతున్నా లెక్చరర్లు లేకపోవడం దారుణమన్నారు. ఏఐడీఎస్‌ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న, ఎం.శాంతి, విద్యార్థులు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ మృతి.. బాధ్యులపై చర్యలు

● నిర్లక్ష్యం వహించిన వైద్యుడు, నర్సు బదిలీ ● సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కంప్లి ప్రభుత్వ సముదాయ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ రవీంద్ర కనికేరి, స్టాఫ్ నర్స్ రజినిపై వేటు పడింది. రామసాగర గ్రామానికి చెందిన చంద్రమ్మను ప్రసవం కోసం కంప్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు గురువారం ఆశా కార్యకర్త తీసుకువచ్చారు. ఆస్పత్రిలో డాక్టర్ అందుబాటులో లేకపోయినా డ్యూటీలో ఉన్న నర్స్ రజిని చంద్రమ్మకు చికిత్స చేసింది. స్కానింగ్ చేయించారు. ఆ రిపోర్టులో ప్రసవం సాఫీగానే అవుతుందని భర్త సన్నరమేష్‌కు వారు తెలిపారు. వారిచ్చిన ధైర్యంతోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రిలోనే ఉన్నారు. డాక్టర్ లేకుండా నర్సు సాయంత్రం వరకు చికిత్స కొనసాగించింది. చంద్రమ్మకు ప్రసవమై శిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు మృతి చెందింది. శుక్రవారం డాక్టర్ రవీంద్ర కనికేరి చంద్రమ్మకు చికిత్స అందించారు. రక్తస్రావం అధికం కావడంతో మెరుగైన చికిత్స కోసం బళ్లారికైనా, కొప్పాళ ఆస్పత్రికైనా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు బళ్లారికి చికిత్స కోసం వెళ్లారు. బళ్లారిలో చికిత్స పొందుతూ చంద్రమ్మ కూడా మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. నర్సు, వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇద్దరి ప్రాణాలు పోయాయని వారు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే గణేష్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు ఇక్కడ జరిగిన విషయం తెలియజేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు రమేష్ బాబు వారిపై వేటు వేశారు. రజిని సిరుగుప్పకు, రవీంద్ర కనికేరికి సండూరుకు బదిలీ చేశారు. ఇకపై ఆస్పత్రిలో ఎవరు విధుల్లో నిర్లక్ష్యం వహించినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


కంప్లి ప్రభుత్వాస్పత్రి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.08	1,631.83
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11.882	15,135
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,780	15,228
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.11

సబ్సిడీ బియ్యం స్వాధీనం

సిరుగుప్ప, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన సబ్సిడీ బియ్యాన్ని ఆహార సరఫరా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సిరుగుప్ప తాలుకాలోని అల్లాబక్షి అనే వ్యక్తి అక్రమంగా సబ్సిడీ బియ్యాన్ని నిల్వ ఉంచారు. రూ. 29 వేల 11.600 కిలోల సబ్సిడీ బియ్యాన్ని స్థానికుల సమాచారం మేరకు ఆహార పౌర సరఫరా అధికారులు దాడి చేశారు. ఆహార పౌరసరఫరాల ఇన్స్‌పెక్టర్ విజయ్ కుమార్ అతనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీ బియ్య అక్రమంగా నిల్వ ఉంచినా, తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హోసూరు జోన్


క్రీడాకారులతో మేయర్ సత్య

ముఖ్యమంత్రి కప్ విజేతలకు ప్రశంసలు

హోసూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హోసూరు నుంచి జిల్లాస్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీల విజేతలను హోసూరు మేయర్ సత్య అభినందించారు. సీఎం కప్ పోటీలలో హోసూరునుంచి వచ్చిన ఆటగాళ్లు, వాలీబాల్ పోటీల్లో పాల్గొని రాణించారు. విజేత జట్టును మేయర్ స్వయంగా ప్రశంసించారు. ఈగిల్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ థాయుమానవన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో విద్యార్థులు, వైద్య సిబ్బంది

హోసూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లోని స్కూల్‌మిడిల్ స్కూల్‌లో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హిందుస్తాన్ యూనీలివర్ లిమిటెడ్, ప్రభాత్ ఆర్గనైజేషన్, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్‌లో భాగంగా కార్పొరేషన్‌లోని 3వ వార్డు పదర్‌పల్లి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబరు నెలను పోషకాహార మాసోత్సవంగా ఆచరిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్ నాగేశ్, హిందూస్తాన్ సంస్థ అధికారులు ర్యాలీని ప్రారంభించారు. రక్తహీనత సమస్యపై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని కమ్మేసిన మబ్బులు

హోసూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో శనివారం పగటివేళ మబ్బులు కమ్మేశాయి. హోసూరు ప్రాంతం ఏడాది పొడవునా చలి వాతావరణం ఉంటుంది. అయితే సరిహద్దున ఉన్న కర్ణాటక ప్రభావం నగరంపైనా చూపుతోంది. హోసూరు పరిసర ప్రాంతాలలో రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా తరచుగా వర్షాలు కురుస్తున్నాయి. ఎప్పుడూ మేఘావృతంగా ఉంటోంది. ఓవైపు వర్షం, మరోవైపు ఎండ, చల్లటి గాలులు వీస్తున్నాయి.



గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

బళ్లారి గాంధీనగర్/సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంట్లో సిలిండర్ పేలిన ప్రమాదంలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. విజయనగర జిల్లా, గాదిగనూరు గ్రామం హొసపేట-బళ్ళారి జాతీయ రహదారి ప్రక్కనే వకీలప్ప హాలప్పకు చెందిన ఇంట్లో శనివారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంటిలో 8మంది గాయపడ్డారు. వీరిలో ఇంటి యజమాని కవిత తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో 60శాతంపైగా ఇల్లు ధ్వంసమైంది. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో పెద్ద శబ్దం రావడంతో ఇరుగుపొరుగు వారు ఏమిజరిగిందని బయటకు వచ్చి చూసేలోగా దారుణం జరిగింది పోయింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు, అగ్నిమాపక శాఖకు అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. ఘటనలో గాయపడిన వారిని తోరణగల్లులోని సంజీవిని ఆసుపత్రికి తరలించారు. గ్యాస్‌స్టౌవ్ ఆన్‌చేసి మరిచిపోయిన కవిత చాలాసేపటి తర్వాత స్టౌవ్ వెలిగించే ప్రయత్నం చేసింది.. అప్పటికే గ్యాస్‌తో ఇల్లంతా నిండిపోయిన విషయాన్ని గమనించని ఆమె స్టౌవ్ వెలిగిస్తుండగా క్షణాల్లో ఇల్లంతా మంటలు వ్యాపించి గ్యాస్‌సిలిండర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. పేలుడు ధాటికి ఇళ్లు ధ్వంసం అయ్యింది. కవితతో పాటు హాలప్ప, గంగమ్మ, మైలారప్ప, మల్లమ్మ, కావేరి, కావ్య, నిఖిల్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేయగా, పోలీసులు ఘటనలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు హసపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో కవితా అనే మహిళ పరిస్థితి ఆందోళన కరంగా ఉండగా మిగిలిన వారు ప్రాణాపాయం నుండి బయట పడినట్లు డాక్టర్లు తెలిపారు.

పరామర్శించిన మంత్రి

ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి ఉన్నత చికిత్సలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో గాయపడిన రెండేళ్ళ చిన్నారి 70శాతం మేర శరీరంపై గాయాలు అయ్యాయని, పరిస్థితి తనను కలవర పరిచిందన్నారు. చిన్నారి తండి జైలులో ఉన్నట్లు సమాచారం ఉందని, ప్రమాదంలో గాయపడిన వారిలో కొంతమందికి ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉందని, డాక్టర్లు తెలిపినట్లు, బెంగళూరు నుండి వైద్యులు వచ్చి పరీక్షించిన అనంతరం మెరుగైన చికిత్సకు ఇతర ఆసుపత్రులకు తరలించాలని డాక్టర్లకు సూచించినట్లు మంత్రి తెలిపారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి జమీర్

పర్యాటక ప్రదేశాలను కాపాడుకుందాం

● తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ ముండరగి నాగరాజు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నముండరగి నాగరాజు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న చారిత్రక ప్రదేశాలను సంరక్షించడం, అభివృద్ధి చేయడం, రక్షించడం మనందరి కర్తవ్యమని బాబు జగ్జీవన్ రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ ముండరగి నాగరాజు అన్నారు. నగరంలోని చారిత్రాత్మక కోట ముందు శనివారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటకలో అనేక చారిత్రక పర్యాటక ప్రదేశాలు, అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. ప్రపంచ ప్రఖ్యాత హంపి తుంగభద్ర ఆనకట్ట పర్యాటక ప్రదేశాలు ఇప్పుడు పొరుగున ఉన్న విజయనగర జిల్లా పరిధిలో ఉన్నాయి. అయితే మన బళ్లారి జిల్లాలో సండూర్‌లోని కుమారస్వామి ఆలయం, స్వామిమలై ఫారెస్ట్ రిజర్వ్,నారిహళ్ళా రిజర్వాయర్, ప్రపంచంలోని రెండవ ఏకశిలా కొండ బళ్లారి చారిత్రక కోట , మించేరి కొండ, సంగనకల్లు కొండ, సిరుగుప్పలోని తెక్కల కోట, కెంచనగుడ్డ, కురుగోడ్‌లోని దొడ్డ బసవేశ్వర ఆలయం వంటి అనేక పర్యాటక ప్రదేశాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలు కాకుండా పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. ఐదువేల సంవత్సరాల చరిత్రకలిగిన సంగనకల్లు కొండ ప్రాంతం నియోలిథిక్ యుగం నాటి ఆనవాళ్ళలో కూడుకున్నదని,దక్షిణ భారతదేశంలో అతి పెద్ద జనవాస ప్రాంతంగా చరిత్ర కలిగి ఉందని రాబర్ట్ బ్రూస్ ఫూట్ సంగనకల్లు పురావస్తు మ్యూజియం సభ్యుడు అహిరాజ్, జిల్లాహోటల్ యజమానుల సంఘం జాయింట్ సెక్రటరీ జితేంద్ర, సరళాదేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బసప్ప, పర్యాటక సీనియర్ టూరిజం ప్రమోటర్ శ్రీహరి మననూర్, పర్యాటక మిత్రులు సహా విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

కంప్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జోరువానలతో పాత ఇళ్లు కూలిపోతున్నాయి. ముద్దటనూరు గ్రామానికి చెందిన పార్వతమ్మ ఎం సూగూరు గ్రామానికి చెందిన నిర్మలమ్మ, షానవాసపుర గ్రామానికి చెందిన సిద్దరామ ఇల్లు కూలిపోయాయ. ఉప్పర హోసళ్లి గ్రామానికి చెందిన పద్మావతి ఇల్లు కూలి పోయిందని గ్రామ పాలనాధికారి నివేదించారు. గ్రామ లెక్క అధికారి వీరేష్ పరిశీలించి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు.


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారి

మాదకద్రవ్య రహిత దేశమే లక్ష్యం

● మారథాన్‌లో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి


మారథాన్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత భారతదేశం సంకల్పంతో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా శనివారం నగరంలో నమో యువ పరుగును నిర్వహించింది. నగరంలోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన మారథాన్ అండర్ బ్రిడ్జి ,గడగి చెన్నప్ప సర్కిల్ మీదుగా హెచ్, ఆర్ గవియప్ప సర్కిల్ వరకు సాగింది. ఇందులో 9కళాశాలల విద్యార్థులు, బీజేపీ నాయకులు,కార్యకర్తలు ఈ మారథాన్‌లో పాల్గొని పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరమని అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడిన సోమశేఖర్‌రెడ్డి నేరస్థులు నడుపుతున్న మాదకద్రవ్య బానిసలుగా యువజన బృందం నేడు తమ చదువులను పాడుచేసుకుంటుందన్నారు. ఈచెడు ప్రపంచం నుంచి యువతను కాపాడడమే మారథాన్ ఉద్దేశమన్నారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌నాయుడు, నగర అధ్యక్షుడు గణపాల ఐనాథ్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాశ్, నాయకులు హనుమంతప్ప, డాక్టర్ బి.కే.సుందర్, ఎర్రంగలి తిమ్మారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పోరేషన్ బోర్డు ఆఫీస్ బేరర్లు, మహానగర కార్పోరేషన్ సభ్యులు మండల ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులగణనను వేగవంతం చేయండి : తహసీల్దార్

సిరుగుప్ప, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : కులగణన సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ గౌసియా బేగమ్ అధికారులకు సూచించారు. శనివారం తహసీల్దార్ గౌసియా బేగమ్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అక్టోబరు 9వ తేదీలోపు కులగణన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


తహసీల్దార్ గౌసియా